క్లుప్తంగా

ఆధార్ అనుసంధానం తప్పనిసరి



పిడుగురాళ్ల: ఓటు నమోదు సమయంలో ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయాలని తహసీల్దార్ ఎంవీ చక్రవర్తి, ఎంపీడీఓ బి.కాశయ్య సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చక్రవర్తి, ఎంపీడీఓ కాశయ్య మాట్లాడారు. నూతన ఓటు హక్కు దరఖాస్తులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మసీదు ప్రారంభం

దాచేపల్లి: మండలంలోని గామాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన మహ్మదీయ మసీద్‌ను మంగళవారం ప్రారంభించనున్నట్లు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ ముస్తాఫా మౌలానా సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, సర్పంచ్ జంగా సురేష్‌తో పాటు ముస్లిం మతపెద్దలు పాల్గొంటారని తెలిపారు. ముస్లిం నాయకులు, యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలోని 133/32 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మంగళవారం సాయంత్రం 3 నుంచి 6గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏడీఏ రామయ్య సోమవారం తెలిపారు. సబ్ స్టేషన్‌లో రిలే టెస్టింగ్ కోసం వెల్దుర్తి, ఉప్పలపాడు, గుండ్లపాడు, కండ్లకుంట, కొత్తపుల్లారెడ్డి గూడెం, అచ్చమ్మకుంట, గొట్టిపాళ్ళ, గంగలకుంట, విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు జాతీయ భద్రతా దినోత్సవం

మాచర్ల: పట్టణంలోని కేసీపీ సంస్థ ఆధ్వర్యంలో 52వ నేషనల్ సేఫ్టీ సెలబ్రేషన్స్ ప్రోగ్రాంను మంగళవారం నిర్వహించినట్లు కేసీపీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు పాత కిడ్స్ పాఠశాల ఆవరణలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ గుంటూరు అధికారి ఎం.శివకుమార్‌రెడ్డి, సేఫ్టీ అధికారి కె.శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని వెల్లడించారు. కేసీపీ జీఎం బీవీపీఎస్ చౌదరి, సీహెచ్ రాంబాబు, యూనియన్ నాయకులు జీఎల్ నారాయణ, ఒ.శివయ్య, సేఫ్టీ అధికారి ఎస్.కుమార్‌రాజు పాల్గొని సేఫ్టీ దినోత్సవ ప్రాధాన్యత వివరిస్తారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్మికులు, ఉద్యోగులకు బహుమతులు అందజేసి, అభినందించటం జరుగుతుందన్నారు.

నేడు వాహనాల వేలం

మాచర్ల: పట్టణంలో ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో నాటుసారా, అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడి వాహనాలకు మంగళవారం వేలం పాట నిర్వహించనున్నట్లు సీఐ జీవీ ప్రసాదరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వేలంపాటలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఎస్ఈబీ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

పిడుగురాళ్ల: మహిళా దినోత్సవం సందర్భంగా పల్నాడు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా మందులు, 50 శాతం రాయితీపై థైరాయిడ్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

నేడు లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవం

మాచవరం: మండలంలోని శింగరాయపాలెం తండా గ్రామ సమీపంలో కొండపై వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నృసింహస్వామి (కొండ సింగరయ్య) వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు క్యాన్సర్ నిర్ధారణ ఉచిత పరీక్షలు

చిలకలూరిపేట టౌన్: ఇన్నర్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఒమేగా క్యాన్సర్ స్పెషాలిటీ హాస్పిటల్ గుంటూరు సౌజన్యంతో మంగళవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ గట్టు సరోజిని, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజ్యలక్ష్మి, ఎస్ జయలక్ష్మి చెప్పారు. పట్టణంలోని గాంధీపేటలో ఉన్న డాక్టర్ గట్టు రంగారావు ఆసుపత్రిలో ఉదయం 10 గంటల నుంచి రూ.4 వేలు విలువ చేసే పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు.

సొంతింటి కల సాకారం..

- వైఎస్సార్ జగనన్న కాలనీల్లో చకచకా గృహ నిర్మాణాలు
- సకాలంలో బిల్లుల చెల్లింపు..
- ఆనందంగా లబ్ధిదారుల గృహ ప్రవేశాలు



గురజాలలోని జంగమహేశ్వరపురం కాలనీలో గృహ నిర్మాణాలు

గురజాల: పేదలు ప్రభుత్వాల నుంచి ఆశించే ప్రధాన అంశాలు విద్య, వైద్యం, గూడు. ఈ మూడింటికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మొదట్నుంచీ పెద్దపీట వేసింది. ముఖ్యంగా పేదల సొంతింటి కల సాకారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక మహాయజ్ఞాన్ని తలపెట్టారు. ఆ యజ్ఞం ఫలితాలు వైఎస్సార్ జగనన్న కాలనీల ద్వారా పేదలకు అందుతున్నాయి. గత ప్రభుత్వంలో పేదలకు సెంటు భూమి ఇచ్చిన దాఖలాలు లేవు. పాలకులు కేవలం దోచుకో.. దాచుకో అన్న నినాదానికే ప్రాధాన్యత ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. అధికారంలోకి రాగానే ప్రతి పేద వాడికి స్థిరాస్తిని కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. వేగంగా ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వమే సాయమందించి, త్వరితగతిన నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన ఇనుము, సిమెంటు, ఇసుకను అందించడంతో పాటు బిల్లులు కూడా సకాలంలో మంజూరు చేస్తున్నారు.

35 లే అవుట్లు.. 11,515 ఇళ్ల పట్టాలు..

గురజాల, దాచేపల్లి , పిడుగురాళ్ల, మాచర్ల పట్టణ కేంద్రాల్లో 35 వైఎస్సార్ జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. 11,515 మందికి ఇళ్ల ప్లాట్లు అందించడం జరిగింది. వీటిలో 1,347 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. 2,240 గృహాలు శ్లాబు పూర్తి చేసుకున్నాయి. మిగతా గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రతి వారం హౌసింగ్ శాఖ అధికారులు, ప్రత్యేక, మండలస్థాయి అధికారులు గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ.. చైతన్య పరుస్తున్నారు.

కాలనీల్లో మౌలిక వసతులు

జగనన్న కాలనీల్లో ఇప్పటికే మౌలిక వసతులు కల్పించారు అధికారులు. ఇంటి నిర్మాణాలకు కావాల్సిన సామగ్రిని అందుబాటులో ఉండే విధంగా ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి.. విద్యుత్ సౌకర్య కల్పించారు. రహదారులు ఏర్పాటుచేయడంతోపాటు, నీటి వసతి కల్పించారు. పూర్తిస్థాయి డ్రెయిన్లతో జగనన్న కాలనీలు ఒక ఊరిని తలపించేలా తీర్చిదిద్దారు.

వైఎస్సార్ జగనన్న కాలనీలు, ఇళ్ల స్థలాలు

పట్టణం	కాలనీలు	ఇళ్ల స్థలాలు
గురజాల పట్టణం	4	1496
దాచేపల్లి పట్టణం	7	1977
పిడుగురాళ్ల పట్టణం	3	2752
మాచర్ల పట్టణం	21	5290

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి



అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇంటి నివేశన స్థలం మంజూరు చేసింది ప్రభుత్వం. గతంలో ఎన్నడూ జరగని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేల మందికి పట్టాలు పంపిణీ చేశారు.

– యశోద దుర్గా,
మహిళా నాయకురాలు, గురజాల

లబ్ధిదారులు ముందుకు రావాలి

లబ్ధిదారులు ఇంటి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకోవాలి. వలంటీర్లు, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. బిల్లులు త్వరితగతిన విడుదలవుతున్నాయి. పెండింగ్‌లో లేవు. ఈ విషయాన్ని లబ్ధిదారులు గుర్తించాలి.

– ఎస్.సుబ్రహ్మణ్యం,
హౌసింగ్ డీఈ, గురజాల

సంక్షేమ పథకాలకు ప్రజల జేజేలు

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గురజాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు జేజేలు పలుకుతున్నారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. నగర పంచాయతీలోని 14, 9 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి ప్రతి ఒక్కరిని అప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఇంటికి త్వరలోగా తాగునీటి కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అర్హత ఉంటే చాలు.. పథకాలు ఇంటి వద్దకే వస్తాయన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే.. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముందుగా శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రజక వీధిలో ఎమ్మెల్యే కాసుకు మహిళలు హరతులిచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ ఎంపీపీ షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, జడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, గురజాల ఏఎంసీ డైరెక్టర్ కె.అంద్రెయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ నాగులు మీరా, పట్టణాధ్యక్షుడు షేక్ మీర్‌సా, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ కె.ప్రగతి కోటేశ్వరరావు, జక్కా రమణ, కౌన్సిలర్లు కుక్కమూడి అనిల్ కుమార్, బండి రవికుమార్, గోళ్ల సైదయ్య, మహిళా నాయకురాలు మహంకాళీ యశోద దుర్గా, నీలంరాజు, వేలమూరి సైదారెడ్డి, కందిమళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

మాచవరం: మండలంలోని శ్రీ రుక్మిణీపురం గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సింగరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి గ్రామంలో పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవాలు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని తెలిపారు.

25లోగా సొసైటీ రుణాలు చెల్లించాలి

శావల్యాపురం: సొసైటీ బ్యాంకులో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని వినుకొండ సొసైటీ బ్యాంకు మేనేజరు బత్తుల బాలకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయాన్ని సందర్శించి ఆయన మాట్లాడుతూవినుకొండ నియోజకవర్గంలో ఎనిమిది సొసైటీ బ్యాంకులు ఉండగా రూ.129 కోట్లు రైతులకు వ్యవసాయ అనుబంధ రుణాలను మంజూరు చేశామన్నారు. ఇప్పటికే రూ.40 కోట్లు వసూలు అయినట్లు చెప్పారు. ఈనెల 25 లోగా తీసుకున్న రుణాలను చెల్లించాలని లేని పక్షంలో ప్రభుత్వ పరంగా వచ్చే రాయితీ నగదు కోల్పోతారని, అదనంగా వడ్డీ చెల్లింపులతో పాటు అపరాధ రుసుం ఉంటుంద న్నారు. శావల్యాపురం సొసైటీ పరిధిలో రూ.40 కోట్లు రుణాలను మంజూరు చేయగా రూ. 5 కోట్లు రైతులు చెల్లింపులు చేశారన్నా రు. ఆయనతో పాటు సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు ఉన్నారు.

సీసీ రహదారి పనులు ప్రారంభం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రూ.50 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు పంచాయతీరాజ్ డీఈ కె.కోటేశ్వరరావు సోమ వారం తెలిపారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ గ్రామస్తులు సహకారంతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో గ్రామంలో ప్రధాన కూడలి మర్గాం నుంచి ఎస్సీ కాలనీ వరకు 600 మీటర్ల సీసీ రోడ్డు పనులు జరుగుతాయని, సీసీరోడ్డు వెడల్పు 5 మీటర్ల, 8 అంగుళాల మందంతో పనులు పది రోజుల వ్యవధిలో పూర్తి అవుతాయన్నారు. పంచా యతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి, సర్పంచ్ పోపూరి జ్యోతి, వైఎస్ ఎంపీపీ ప్రభావతి, గ్రామస్తులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థుల విరాళం



విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దాచేపల్లి: తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు తోడ్పాటునందిస్తామని పూర్వ విద్యార్థులు అన్నారు. దాచేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984–85 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు రూ.1.50లక్షల విరాళాన్ని ఎస్ఐ సంధ్యారాణి చేతుల మీదుగా అభివృద్ధి కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, పూర్వ విద్యార్థి బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. పూర్వ విద్యార్థులు షేక్ ఖాసింపీరా, షేక్ మస్తాన్‌వలి, గుండా రాజేశ్వరరావు, గొట్టం అంజిరెడ్డి రూ.లక్ష చొప్పున మూడు లక్షల రూపాయలు హైస్కూల్ అభివృద్ధికి ఇటీవల విరాళం ఇచ్చారని చెప్పారు. వినాయక ఇండ్రస్ట్రీస్ ద్వారా పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి ఉచితంగా అందిస్తామని ఆయన చెప్పారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు పూర్వ విద్యార్థులందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి. శైలజ, పూర్వ విద్యార్థులు షేక్ జాకీర్ హుస్సేన్, బలుగూరి నరసింహారావు, అక్కినపల్లి బాలయ్య, జాస్తి హనుమంతరావు, మట్టయ్య, పెదలాల, ఎస్ఎస్ రావు, లాలయ్య, కొత్వాల్ సైదా, ముండ్ర రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..



నడికుడిలో పర్యటిస్తున్న చైర్మన్ సాంబయ్య, నాయకులు

దాచేపల్లి: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 17వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనుల గురించి కో-ఆప్షన్ సభ్యుడు వేల్పుల ధర్మదేవ్ చైర్మన్‌కు వివరించారు. వార్డులో నిర్మించాల్సిన కల్వర్టు గురించి చర్చించారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని, తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్ చెప్పారు. ఈ పరిశీలనలో నాయకులు శ్రీరాములు, కొగంటి మణికంఠ, బొల్లంపల్లి మరియన్న, వేల్పుల మల్లికార్జునరావు, బొల్లంపల్లి ఏసుదానం, శ్రీపతి ఏసుదాసు, మేడి మరియదాసు, జినుగు లాజర్ తదితరులున్నారు.

వ్యర్థాల సేకరణపై శిక్షణ



చెత్త సేకరణపై వివరిస్తున్న డీపీఆర్‌సీలు

రొంపిచర్ల: గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్‌లు చెత్త సేకరణలో కనీస పద్ధతులు పాటిస్తే చెత్త నుంచి సంపదను సృష్టించటం సులవు అవుతుందని డీపీఆర్‌సీ అమరేశ్వరరావు అన్నారు. స్థానిక శిక్షణా కేంద్రంలో సోమవారం రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం గ్రామ సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గృహాల నుంచి చెత్త సేకరణలో గ్రీన్ అంబాసిడర్‌లు తీసుకోవల్సిన కనీస జాగ్రత్తలపై వివరించారు. గ్రామంలో చెత్త సేకరణ, అలాగే తొట్లలో తడిచెత్త నింపడం, తదితర విషయాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. శిక్షణలో తెలుసుకున్న పద్ధతులను గ్రీన్ అంబాసిడర్‌లకు వివరించాలని ఆయన సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సర్పంచ్ తిప్పగుడెశ జయమ్మ, గెల్లి చినకోటిరెడ్డి, విశ్వరూపాచారి, రొంపిచర్ల, దాచేపల్లి ఈయోపీఆర్‌డీలు విజయరామ్, మాధవి, వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

9 నుంచి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం



మహంకాళి అమ్మవారు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం 48వ తిరునాళ్ల మహోత్సవాలు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరుగనున్నాయి. 9వ తేదీ గురువారం ఉదయం పూజాద్రవ్యములతో ఆలయ ప్రవేశం, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం, 10వ తేదీ శుక్రవారం అమ్మవారికి పొంగళ్లు, పసుపు కుంకుమలు సమర్పణ, సాయంత్రం 6.30 గంటలకు ఇస్సప్పాలెంలో అమ్మవారి గ్రామోత్సవం, 11వ తేదీ ప్రధాన కలశ ఆలయ ప్రవేశం, ఉత్సవ పుర్ణాహుతి, మధ్యాహ్నం 12గంటలకు అన్న సమారాధన, సాయంత్రం జాగరణ కార్యక్రమం నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్టు ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి తెలిపారు.

ఎల్లో మీడియా ప్రచారాన్ని తిప్పికొట్టాలి

సోషల్ మీడియా సభ్యులతో ఎమ్మెల్యే పీఆర్కే



సోషల్ మీడియా సభ్యులతో కేక్ కట్‌చేస్తున్న పీఆర్కే, పీవీఆర్

మాచర్ల: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖపట్టణంలో జరిగిన పారిశ్రామిక సదస్సు విజయవంతం కావటాన్ని తట్టుకోలేక దుర్మార్గమైన ప్రచారాన్ని ఎల్లో మీడియా చేస్తోందన్నారు. దీనిని తిప్పికొట్టేందుకు సోషల్ మీడియా ప్రతినిధులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎంపికైన సోషల్ మీడియా సభ్యులను అభినందించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ప్రతినిధులు, ఆయా సచివాలయాల గ్రామ సారథులు పాల్గొన్నారు.

హాస్పిటల్ ప్రారంభం

పట్టణంలోని రామాటాకీస్‌లైన్‌లో వైద్యులు గుర్రం రాజశేఖరరెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ మల్టిస్పెషాలిటీ హాస్పటల్‌ను సోమవారం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధానకార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుజాత కోటిరెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ ఓరుగంటి చిన్నా, ఆసుపత్రి నిర్వాహకులు రామిరెడ్డి, పలువురు నాయకులు డాక్టర్లు పాల్గొన్నారు.

రేషన్ షాపుల పరిశీలనకు 10 బృందాలు

ఆర్డీఓ కె.అద్దయ్య వెల్లడి



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అద్దయ్య

మాచర్ల రూరల్: రేషన్ డీలర్లు సకాలంలో సరుకుల పంపిణీ చేయకపోతే డీలర్‌షిప్ రద్దు చేయాలని గురజాల ఆర్డీఓ కె.అద్దయ్య ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మాచర్ల, వెల్దుర్తి, కారంపూడి, దుర్గి, రెంటచింతల తహసీల్దార్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రతి నెలా నిర్ణీత సమయంలో కార్డుదారులకు సరుకులను అందించాలని, సక్రమంగా పంపిణీ చేయకపోయినా, నిల్వలున్నా డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేసి, అవసరమైతే డీలర్‌షిప్‌ను రద్దు చేయాలని ఆదేశించారు. రేషన్ షాపులను పరిశీలించేందుకు రెవెన్యూ సిబ్బందితో 10 బృందాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. వీరు ప్రతి డిపో రికార్డులను పరిశీలించి, సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటారని చెప్పారు. జాతీయ రహదారికి భూ సేకరణ పనులపై ఆరా తీశారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు జి.రమేష్‌కుమార్, జి.శ్రీనివాసయాదవ్, కె.పుల్లారావు, డీటీలు మురళీధర్, కొండారెడ్డి, బాషా, శర్మ, కీర్తి, వాణి, ఆర్ఐలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో విస్తృత తనిఖీలు

మాచర్ల: గురజాల ఆర్డీఓ కె.అద్దయ్య, తహసీల్దార్ రమేష్‌బాబు, సీఎస్‌డీటీ శర్మ, స్థానిక డీటీ మురళి, ఏఎస్ఓ బాషా, నరసరావుపేట డీటీ కొండారెడ్డి ఆధ్వర్యంలో నాలుగు బృందాలు 25 రేషన్ షాపులను తనిఖీలు చేశాయి. సోమవారం ఉదయం నుంచి నర్సరావుపేట, గురజాల విస్తృతంగా షాపులు తనిఖీ చేసి, సరుకు నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఆయా షాపుల్లో డీలర్లు, ఎండీఎంలను ఉద్దేశించి మాట్లాడారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి వరకు తనిఖీలు నిర్వహించి, నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జాతీయ మహిళా కమిషన్ సభ్యులు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మండల న్యాయ, కార్యవర్గ సంస్థ ఆధ్వర్యంలో మహిళాదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా.. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ న్యాయవాది కట్టా కాళిదాస్, ఎస్‌బీఐ ఝాన్సీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కట్టా కాళిదాసు మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలని, అన్ని రంగాల్లో రాణించినప్పుడే సాధికారత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి. చంద్రకళ, పి.మాణిక్యం, మున్సిపల్ మేనేజర్‌శ్రీనివాసరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


వేల్పూరులో వైభవంగా బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుటుంబ సభ్యులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీభూసమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, సతీమణి ఆదిలక్ష్మి దంపతులు, కుమారుడు బొల్లా శ్రీనివాసరావు, గిరిబాబు దంపతులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారీ డివి. మారుతీ రామచార్యులు, రత్నకర్ సాయిమాధవచార్యులు, వెంకట శేషాచార్యులు, సాత్వీక్ వేదమంత్రాలు, మేళాతాళాల నడుమ వేడుకలు తొలిరోజు భూ పూజ, నవధాన్యలతో అంకురార్పణ తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 7న స్వామి వారికి అభిషేకాలు, ధ్వజరోహణ, శేషవాహనంపై ఊరేగింపు, 8న దంపతులచే హోమాలు, చివరిరోజు 9వ తేదీన అన్నదాన కార్యక్రమం సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు కార్యక్రమాలు సాంస్కృతిక కార్యక్రమాలతో ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ముండ్రు రాఘవరావు, తూమాటి కబ్బారావు, స్వర్ణాల వెంకట్రావు, సాదినేని చిన వెంకయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా తిరునాళ్ల వేడుకలు



ప్రత్యేక అలంకరణలో ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్

యడ్లపాడు: మండలంలోని సంగంగోపాలపురం- చెంఘీజ్‌ఖాన్‌పేట పరిధిలో కొండవీడు కొండల దిగువన ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి 39వ తిరునాళ్ల మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. వేకువ జామునుంచే ఆలయానికి భక్తులు బారులుదీరారు. చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస, బోయపాలెం గ్రామస్తులే కాకుండా సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. వార్షిక వేడుకల సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు, నూతన పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకారకృతుడై భక్తులకు దర్శనమిచ్చాడు. ఆలయ ప్రాంగణం దిగువన ఉన్న స్వామివారి విగ్రహం వద్ద పొంగళ్లు పొంగించి నైవేద్యాలను సమర్పించి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. చెంఘీజ్ ఖాన్‌పేట పంచాయతీ ఆధ్వర్యంలో తిరునాళ్ల సందర్భంగా భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస గ్రామాలకు చెందిన పెద్దల సమన్వయంతో తిరునాళ్ల ఏర్పాట్లు భారీగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయానికి కొత్త రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక ప్రసాదాలను వితరణ గావించారు. ఉదయం 11 గంటల నుంచి భారీ అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రికి భారీ విద్యుత్ ప్రభలతో పాటు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.